క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి కంటి పరీక్షలు



సత్తెనపల్లి: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు కంటి పరీక్షలు చేయించుకున్నారు. స్టేషన్‌లోని సిబ్బందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు.

సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం ప్రారంభం



సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలంలోని అబ్బూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమావేశాలు జయప్రదం చేయండి



సత్తెనపల్లి: కేంద్రంలోని ఎన్డీఏ మోదీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలపై చర్చించేందుకు విశాఖపట్నంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంభాల శ్రీనివాస్ కోరారు. శనివారం సత్తెనపల్లిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదైన రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను కారు చౌకగా అప్పజెబుతోందని విమర్శించారు. ప్రభుత్వ కార్మికులకు భద్రత కల్పించకుండా వారి శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకనాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.ఇర్మియ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, ఈసీ రెడ్డి, ఎ.రమేష్, ఇరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి సీఐగా బ్రహ్మం



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణ సీఐగా బి.బ్రహ్మం శనివారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణ సీఐగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించి శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తానని, పట్టణ వాసులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వ్యాపార వర్గాల వారు పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

ఊటుకూరులో వైద్య శిబిరం



ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు డాక్టర్ సిరిచందన తెలిపారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయన్న సమాచారం మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసామని చెప్పారు. ముగ్గురు జ్వర పీడితులకు వైద్య చికిత్సలు అందించామన్నారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాలువల్లో ఎబెట్ స్ప్రే చేయించటం, లార్వా అభివృద్ధి చెందకుండా పీడీపీ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి బేగ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేత

గురజాల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామానికి చెందిన ఎం.వెంకటేష్, చందనలు ఆశ్రమానికి నెల రోజులకు సరిపడా సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు నాగమల్లేశ్వరి, కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మీ, పవన్, జశ్విత్, నరేంద్ర, గౌరి తదితరులున్నారు.

వైద్యులపై దాడులు హేయం



కోల్‌కతాలో ప్రాణాలను కాపాడే మహిళా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడడం హేయమైన చర్య. ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. సాక్ష్యాలను మార్చి నిందితులను కాపాడేందుకు ప్రయత్నించడం దారుణం. మహిళలపై ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ కేవీ కోటేశ్వరరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చంద్రాజుపాలెం



ప్రాణాలు పోసే వారికి రక్షణ కల్పించాలి



ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ లేకపోవటం బాధాకరం. నైట్ డ్యూటీలో విధులు నిర్వహించే వైద్యులకు సెక్యూరిటీ కల్పించాలి. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. వారు ఎంతటి వారైనా నిష్పక్షపాతంగా వ్యవహరించి వారికి కఠినమైన శిక్షలు విధించాలి. అలాంటి చట్టాలను రూపొందించి అమలు చేస్తే మరోమారు ఈ తరహా ఘటనలు పునారావృతం కావు. అప్పుడే మహిళలకు రక్షణ లభిస్తుంది.

– పి.రమాదేవి, పీహెచ్‌సీ వైద్యురాలు, ముప్పాళ్ల

విద్యుత్ షాక్... పరిహారం ఇస్తారా..!?

- విద్యుదాఘాతంతో మరణిస్తే పరిహారం
- ఎఫ్ఐఆర్, పోస్టుమార్టంతో దరఖాస్తు చేసుకోవాలి
- అవగాహన లేక నష్టపోతున్న రైతులు, ప్రజలు



గత నెలలో విద్యుత్‌షాక్‌తో బెల్లంకొండలో చనిపోయిన గేదె



ఈ నెలలో వెంకటాయపాలెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ తగిలి చనిపోయిన కాడెద్దు

బెల్లంకొండ: ఊహించని విద్యుత్ ప్రమాదాలు, వర్షాలు, తుఫాన్‌ల సమయంలో ప్రమాదవశాత్తూ పశువులు విద్యుదాఘాతానికి గురవుతుంటాయి. దీంతో రూ.లక్షలు విలువ చేసే పాడి గేదెలు, పశువులు అక్కడికక్కడే మృత్యువాత పడిన దాఖలాలు అనేకం.

- వర్షాలు, ఈదురు గాలులు, తుఫాన్‌ల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడుతుంటాయి. వీటిని గమనించక కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, చాలామంది గాయాలపాలవుతున్నారు. ఇలాంటి ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకుంటుంది. అయితే ఈ పరిహారంపై బాధితులకు అవగాహన లేకపోవడంతో చాలామంది నష్టపోతున్నారు.

దరఖాస్తు ఇలా...

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు అయ్యాక పోస్టుమార్టం నిర్వహించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ)కి దరఖాస్తు చేసుకోవాలి. డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం నివేదిక, ఆధార్, బ్యాంక్ అకౌంట్ తదితర కాపీలను జతచేసి విద్యుత్ శాఖ ఏఈకి అందించాలి. ఏఈ ప్రాథమిక స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తారు. దరఖాస్తుతో పాటు, తన నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు పంపిస్తారు. ఆ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తరువాత, మంజూరైన నష్టపరిహారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

వ్యక్తులు మరణించినా, వైకల్యం పొందినా...

పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు విద్యుత్ ప్రమాదం వల్ల మరణించినా, వైకల్యం పొందినా ప్రమాద విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. వైద్యం నిమిత్తం అయిన ఖర్చు బిల్లులు, ఇతర ఖర్చుల వివరాలు సంబంధిత ఆధారాలతో దరఖాస్తుకు జతపరిచి విద్యుత్ శాఖ ఏఈకి అందించాలి. ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి నష్టపరిహారం మంజూరు చేస్తారు.

పశువులు మృతి చెందితే...

పశువులు విద్యుత్ ఘాతానికి గురై మరణిస్తే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్వో, తహసీల్దార్లకు సమాచారం అందించాలి. పశు వైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు విలువ ఆధారంగా, నిబంధనలను అనుసరించి పరిహారం లెక్కిస్తారు. ఆ మేరకు బాధిత రైతుకు నష్టపరిహారం దక్కుతుంది.

పోస్టుమార్టం తప్పనిసరి

విద్యుత్ షాక్‌తో పశువులు మరణిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో రైతు ఫిర్యాదు చేయాలి. పోలీసుల ఎఫ్ఐఆర్ మేరకు పశువైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహిస్తాం. ఆ నివేదికలో సంబంధిత పశువు మరణానికి విద్యుత్ షాక్ కారణమన్నట్లు తేలితే ఆ మేరకు నివేదిక అందిస్తాం. ఈ రెండింటినీ తీసుకెళ్లి విద్యుత్ అధికారులకు అందించాలి. వారు దర్యాప్తు చేసి, పరిహారం అందిస్తారు.

– బాలకృష్ణారెడ్డి, మండల పశు వైద్యాధికారి, బెల్లంకొండ

అర్హులకు మాత్రమే పరిహారం

ప్రమాదవశాత్తూ లేదా విపత్తుల సమయంలో విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తులు మరణించినా, వైకల్యం పొందినా.. అలాగే పశువులు మరణిస్తే.. పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ, వైద్యుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఈ రెండింటినీ సంబంధిత వ్యక్తి కుటుంబ సభ్యులు, రైతులు, మాకు నివేదిస్తే, దర్యాప్తు జరిపి, ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఉన్నతాధికారుల ఆమోదం మేరకు నష్ట పరిహారం బాధితులకు అందజేస్తాం.

– పవన్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ, బెల్లంకొండ

పులిచింతల నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



చౌటపాపాయపాలెంలో గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం: మండల పరిధిలోని పులిచింతల నిర్వాసిత కేంద్రాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో పులిచింతల నిర్వాసితులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం ఆయన అందించి, మాట్లాడుతూ గతంలో నేను ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నిర్వాసిత కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మరలా ఇప్పుడు నా చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించడం సంతోషంగా ఉందని అన్నారు. కేంద్రాలలో మౌలిక వసతులు కల్పిస్తానని నిర్వాసితులు ఆర్థికంగా స్థిరపడేందుకు దోహదపడతానని తెలిపారు. అర్హులైన మిగిలిన వారికి కూడా రిజిస్ట్రేషన్ పత్రాలను త్వరలో అందజేస్తామని చెప్పారు. అనంతరం చౌటపాపాయపాలెంలో గత ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేష్‌రావు, రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్, మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, లాయర్ వెంకటకోటయ్య, తోట నరసయ్య, లంకా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దిడుగులో ఆగ్రో ఫారెస్ట్రీపై అవగాహన



దిడుగు సచివాలయంలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకంపై అవగాహన కార్యక్రమం

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామ సచివాలయంలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపక కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ సదస్సులో ఉద్యానవన మొక్కలు అలాగే అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే దానివల్ల వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ సాయిబాబు, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అడవిజాతి మొక్కలను పొలం గట్లపై నాటుకోవాలి

అచ్చంపేట: అడవిజాతి మొక్కలను, ఉద్యానవన మొక్కలను వ్యవసాయ భూముల గట్లపై నాటుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయని ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్‌వర్మ తెలిపారు. అటవీయేతర ప్రాంతాలలో చెట్ల పెంపకం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కస్తల గ్రామంలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యానవన మొక్కలు అంటే మంచి ఫలాలనిచ్చేవి, నీడనిచ్చేవి, మనిషికి కావలసిన ఆక్సిజన్‌ను ఇచ్చే మొక్కలు అడవులకే పరిమితం కాకూడదన్నారు. మంచి కలపనిచ్చే టేకు, వేప వంటి మొక్కలు పంట భూముల చుట్టూ నాటుకోవడం అవసరం అన్నారు. ఆ మొక్కలు పంటలకు రక్షణగా నిలుస్తాయన్నారు. వాటిని పెంచడానికి పెట్టుబడులు అవసరం లేదని, వర్షపు నీరు, సూర్య రశ్మిని గ్రహిస్తాయని చెప్పారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు కూడా ఉపయోగపడతాయని అన్నారు. కావున రైతులు తమ భూముల చుట్టూ ఉద్యానవన, అడవి మొక్కలను నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ సభ్యులు సాయిశ్రీహర్ష, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధించాలి



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న చైతన్యభారతి సంఘ సభ్యులు

సత్తెనపల్లి: క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు కారణమైన డిస్పోజబుల్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని చైతన్యభారతి, అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థల సభ్యులు శనివారం పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ప్రజా చైతన్యభారతి సంస్థ అధ్యక్షులు దూపకుంట్ల జానకీ రామారావు, అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కుమ్మరి దస్తగిరిలు మాట్లాడుతూ పట్టణంలోని అనేక టీ దుకాణాల్లో, ఇతర దుకాణ సంస్థల్లోను తాగునీరు, టీ, ఇతర పానీయాలు డిస్పోజబుల్ గ్లాసలలో ఇస్తున్నారని, దీని వలన క్యాన్సర్‌కు కావాల్సి వస్తుందన్నారు. అంతే కాకుండా మూగజీవాలు కూడా ప్లాస్టిక్ కవర్లలోని ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా వాటి శరీరంలోకి ఆహారంతో పాటు ప్లాస్టిక్ చేరి అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పిల్లుట్ల ఆంజనేయులు, పెద్దింటి వెంకటేశ్వర్లు, గుంటూరు ఆశీర్వాదం, షేక్ బాబు, నాసరయ్య, హరిబాబు, పిల్లుట్ల పెద్దన్న, పిక్కిలి శివ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి



అమరావతి: స్థానిక పల్లోటి జూనియర్ కాలేజీలో పాదర్ వినోద్ ఆధ్వర్యంలో శనివారం డ్రగ్స్ మాఫియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ పట్టణ ప్రాంతంలో గాక పల్లెటూళ్లలో కూడా ప్రవేశించాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తులై బాధ్యతగా చదువుకోవాలన్నారు. ప్రపంచాన్ని గడగలాడిస్తున్న డ్రగ్స్‌ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తరిమికొట్టాలని, నేటి యువత డ్రగ్స్ బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆడపిల్లలు కూడా డ్రగ్స్ తీసుకుంటున్నారని.. ఇది చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పల్లోటి కళాశాల డైరెక్టర్ ఫాదర్ భాస్కర్, ఎస్సై నరసింహ, గుడ్‌షెపర్డ్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల లార్వా నివారణకు చర్యలు



నాగిరెడ్డిపాలెంలో ఎబెట్‌ను పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది



వన్నాయపాలెంలో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. గత మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'గ్రామాలను వణికిస్తున్న జ్వరాలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించారు. మరుసటి రోజే బుధవారం పలు గ్రామాలలో వైద్య శిబిరాలను నిర్వహించారు. అదేవిధంగా శనివారం అన్ని గ్రామాలలో మరోసారి దోమల లార్వా నివారణకు ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించినట్లు పీహెచ్‌సీ వెద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో అతిసార ప్రబలుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు.

ముగిసిన యల్లమ్మతల్లి కొలుపులు



వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న యల్లమ్మతల్లి కొలుపులు ఘనంగా ముగిశాయి. గ్రామస్తులు గత ఐదు రోజులుగా యల్లమ్మతల్లి కొలుపులను వివిధ రకాలుగా నిర్వహిస్తూ శనివారం చివరి రోజు ఘనంగా నిర్వహించి ముగించారు. భక్తులు అమ్మవారికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో ఊరేగింపు, చివరి రోజు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సంప్రదాయాలు పాటిస్తూ ఇలాంటి ఉత్సవాలను గ్రామస్తులు కలిసికట్టుగా నిర్వహించుకోవటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

శావల్యాపురం: రైతులు సాగు చేసిన పంటలను పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలు ఈ-పంట నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. శనివారం మండలంలోని గుంటుపాలెం, కారుమంచి, మతుకుమల్లి గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలను తనిఖీ చేసి రైతులకు అందిస్తున్న సేవలను పరిశీలించి అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 190 ఎకరాలు సాగు ఏరియాను గుర్తించగా 150 ఎకరాలు సాగు చేసినట్లు తెలిపారు. పంట నమోదు చేయు విధానాన్ని వీఏఏలకు సమగ్రంగా వివరించారు. పంటలు సాగు రైతులందరు సత్వరమే రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలకు సమాచారం తెలపాలన్నారు. పంట నమోదు చేసిన రైతులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు. సెప్టెంబర్ 15 నాటికి ఖరీఫ్ సీజను ముగుస్తుందని తెలిపారు. వ్యవసాయ పరమైన ఇబ్బందులు రైతులు పడకుండా ఉండటానికి నిరంతరం రైతు సేవా కేంద్రంలో వీఏఏలు అందుబాటులో ఉంటారన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కృష్ణవేణి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో తమ విద్యార్థి జి.ధర్మతేజ అండర్-20 విభాగం 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, పి.శివకృష్ణ 10 కిలోమీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సెప్టెంబర్ 14, 15 తేదీలలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.


ఈ పోస్ యంత్రాలతో ఎరువులను పంపిణీ చేయాలి

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి



రెంటచింతల: ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే ఎరువుల డీలర్లు ఈ పోస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువుల పంపిణీ చేయాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకానికి ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్ష పత్రాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులను వాడుకోవాలన్నారు. రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన పెట్టుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులను, పురుగు మందులను వాడినట్లయితే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు డీలర్లు సబ్సిడీపై ఎరువులను విక్రయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లయితే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడికి తీవ్రగాయాలు



వెల్దుర్తి: మాచర్ల పట్టణం శ్రీశైలం రోడ్డులోని రింగ్ రోడ్డు వద్ద కేసీవీఆర్ కాంట్రాక్ట్ సంస్థలో పనిచేస్తున్న ప్రకాష్‌దేవ్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలపాలైన ఘటన శనివారం జరిగింది. కేసీవీఆర్ హైవే రోడ్డు కాంట్రాక్ట్ కంపెనీలో పెయింటర్‌గా పనిచేస్తున్న కోల్‌కతాకు చెందిన ప్రకాష్‌దేవ్ 30 అడుగుల ఎత్తులో గల విద్యుత్ స్తంభాలకు సిల్వర్ పెయింట్ వేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కింద పడటంతో తలకు తీవ్రగాయాలు కావటంతో పరిస్థితి విషమంగా మారింది. శరీరం కాలి బొబ్బలు వచ్చాయి. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్లు ప్రకాష్‌దేవ్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నరసరావుపేట జీబీఆర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రకాష్‌దేవ్‌కు ప్రాణహాని లేదని వైద్యులు తెలిపినట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా పనులు చేయించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



విజయపురిసౌత్: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల హెచ్ఎం సుజిత ముఖ్యఅతిథిగా హాజరై సభాధ్యక్షత వహించారు. హెచ్ఎం సుజిత మాట్లాడుతూ విద్యార్థులకు సర్వ మత సమ్మేళనంపై అవగాహన ఉండేలా క్రిస్టియన్, హిందూ, ముస్లిం మతాలకు చెందిన పండుగలను పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా హిందువులకు ఎంతో పవిత్రమైన కృష్ణాష్టమి పండుగను కనుల పండువగా నిర్వహించామన్నారు. పాఠశాల విద్యార్థులచే ఉట్టి కొట్టించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



గురజాల : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోట శ్రీనివాసరావు, షేక్ జానీబాషా, వై.నరసింహారెడ్డి, కోటేశ్వరరావు, హెచ్ఎం ఏవీ రమణ తదితరులున్నారు.